సాక్షి మంచిర్యాల

శనివారం । 24 । ఆగస్టు । 2024



గల్ఫ్ గాయం.. తీరని దుఃఖం!

ఉన్న ఊరిలో ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్ దేశాలకు వెళ్లి అక్కడే తనువు చాలిస్తున్న ఉమ్మడి జిల్లా వాసులు పెరుగుతున్నారు. కుటుంబాలకు తీరని దుఃఖం మిగులుస్తున్నారు. 8లో▸



అలంకారప్రాయంగా..

గ్రామాల్లో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేసేందుకు ప్రభుత్వం డంపింగ్ యార్డులు నిర్మించింది. అవి అలంకారప్రాయంగా మారాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం 30.3 /25.5

వాతావరణం

ఆకాశం పూర్తిగా మబ్బుపట్టి ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గూడెంలో నేటి నుంచి పవిత్రోత్సవాలు



కొలువు దీరిన రమా, సత్యనారాయణస్వామి

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీరమాసహిత, సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం నుంచి మూడు రోజులు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఆలయ పవిత్రత, భక్తుల శ్రేయస్సు కోసం నిర్వహించే ఈ కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

భవిత కేంద్రాన్ని పరిశీలించిన ఆర్జేడీ



భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జేడీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక భవిత కేంద్రాన్ని ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు పాఠశాల విద్యాశాఖ(ఆర్‌జేడీ) సత్యనారాయణరెడ్డి శుక్రవారం పరిశీలించారు. వివిధ రకాల పండ్లు, కూరగాయల చిత్రాలు చూపిస్తూ వాటి పేర్లను విద్యార్థులను అడిగారు. రైమ్స్ చదివించారు. భవిత కేంద్రం పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డీఈవో యాదయ్య, సెక్టోరియల్ అధికారి చౌదరి, ఎంఈవో పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

తుతుంగ ప్రాజెక్టు కెనాల్‌కు మరమ్మతులు



తెగిన కెనాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కోటపల్లి: మండలంలోని ఎదులబంధం తుతుంగవాగు ప్రాజెక్టు వరద తాకిడికి కట్ట తెగిపోయి గిరిజన రైతుల పొలాలు, కెనాల్‌కు ఎడమవైపు రోడ్డు పూర్తిగా తెగిపోవడంతో రైతులు నష్టపోయారని విషయాన్ని మాజీ ఎంపీటీసీ జేక శేఖర్ ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో శుక్రవారం తుతుంగ వాగు ప్రాజెక్టును ఇరిగేషన్ ఈఈ విష్ణుప్రసాద్, డీఈ వెంకటస్వామి సందర్శించారు. వెంటనే మరమత్తు పనులు ప్రారంభించాలని ఏఈ హరికృష్ణకు సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, రైతులు బాపు, లచ్చయ్య, రాజమల్లు పాల్గొన్నారు.

టీఎన్జీవో సమావేశం

మంచిర్యాలక్రైం: టీఎన్జీవో జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్ తెలిపారు. జేఏసీ రాష్ట్ర చైర్మన్, అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఉపాధ్యక్షుడు మారం జగదీశ్వర్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని వెల్లడించారు. కార్యవర్గ సభ్యులు అందరూ హాజరు కావాలని కోరారు.

గడ్డి క్షేత్రాలను సక్రమంగా నిర్వహించాలి

- సీసీఎఫ్ శాంతారాం



గడ్డి క్షేత్రాల రిజిస్టర్ పరిశీలిస్తున్న శాంతారాం

జన్నారం: కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని జన్నారం అటవీ డివిజన్‌లోని గడ్డి క్షేత్రాలను సక్రమంగా నిర్వహించి వన్యప్రాణులకు ఆహారం అందించాలని టైగర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్, సీసీఎఫ్ శాంతారాం సిబ్బందికి సూచించారు. జన్నారం అటవీ డివిజన్‌లోని ఇందన్‌పల్లి, జన్నారం రేంజ్‌ల పరిధిలోని పలు ప్రాంతాలలో శుక్రవారం పర్యటించారు. గడ్డి క్షేత్రాల నిర్వహణను డీఎఫ్‌వో శివ్‌ఆశిష్‌సింగ్‌తో కలిసి పరిశీలించారు. వన్యప్రాణులు తినే గడ్డిలో కలుపు లేకుండా చూడాలన్నారు. వన్యప్రాణులకు నీటి సౌకర్యం, ఆవాసం ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. వన్యప్రాణులు పెరిగితే పులులు ఆవాసం ఏర్పాటు చేసుకుంటాయని తెలిపారు. అడవిలోకి పశువులు వెళ్లకుండా చూడాలన్నారు. వారివెంట రేంజ్ అధికారి హఫీజొద్దీన్, సెక్షన్ అధికారి రవి, సిబ్బంది ఉన్నారు.

చిక్కులు వీడేలా..



ఆగస్టు 15న కొత్త చట్టంపై అవగాహన కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

- నూతన రెవెన్యూ చట్టంపై రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- భూ హక్కుల మార్పిడిలో సరళీకరణలు
- ప్రస్తుత ధరణి పోర్టల్‌తో పలు సమస్యలు
- నేడు కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కొత్త రెవెన్యూ చట్టంతో భూ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న చట్టం లోపభూయిష్టం ఉండడంతో ఆర్వోఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్)చట్టాన్ని సవరించి 'తెలంగాణ హక్కుల రికార్డు చట్టం 2024' పేరుతో సమగ్ర భూ చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ చట్టం ముసాయిదాపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. ముసాయిదా చట్టాన్ని సీసీఎల్‌ఏ వెబ్‌సైట్‌లోనూ పొందుపర్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత చట్టానికి తుదిరూపు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో జిల్లా కలెక్టరేట్‌లో శనివారం అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా వాసులు హాజరై తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తెలపాలని అధికారులు కోరుతున్నారు. కొత్త చట్టంతోనైనా ప్రస్తుత ధరణి సమస్యల పరిష్కారం దొరుకుతుందని జిల్లా రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో బాధిత రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

హక్కులు రాక అవస్థలు

జిల్లాలో అనేక మందికి ఇంకా భూ యాజమాన్య హక్కులు రాలేదు. హక్కుల బదలాయింపులోనూ సమస్యలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పరిష్కరించాల్సినవి కూడా జిల్లాస్థాయి ఉన్నతాధికారులకే కట్టబెట్టడంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లాలో భూ హక్కుల చిక్కులతో ధరణి పోర్టల్‌లో పలు సమస్యలతో అనేక మంది రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కలెక్టరేట్‌తోపాటు మండల ఆఫీసుల్లో ప్రతీవారం నిర్వహించే ప్రజావాణిలో అధికంగా భూ సంబంధిత సమస్యలపైనే అర్జీలు వస్తున్నాయి. ఇందులో కొన్ని వ్యక్తిగత వివాదాలు ఉండగా, చాలా వరకు యాజమాన్య హక్కులపై చిక్కులే ఉన్నాయి. మరోవైపు సివిల్ కోర్టుల్లోనూ దావాలు నడుస్తున్నాయి. ఇక సాదాబైనామా అర్జీలు పెండింగ్‌లోనే ఉన్నాయి. తెల్లకాగితాలపై ఒప్పందాలు రాసుకున్నవారికి ఇప్పటికీ భూ యాజమాన్య హక్కులు దొరకడం లేదు. ఇక అసైన్డ్ భూములు కొన్నిచోట్ల భూ యాజమానులు అమ్మేసుకున్నారు. వీటిని కొందరు నిరుపేదలు కొనుగోలు చేశారు. కొన్ని చోట్ల రియల్టర్లు, బడా వ్యాపారులు అసైన్డ్ భూములను చెరబట్టారు. వీటితోనూ భూయాజమాన్య హక్కులు రావడంలేదు. వ్యవసాయ భూములను సైతం గతంలో సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో రిజిస్ట్రేషన్లు చేశారు.

జిల్లా స్వరూపం
మొత్తం విస్తీర్ణం 4,016.46చ.కి.మీ.
అటవీ భూమి 1,761.17చ.కి.మీ.
రెవెన్యూ గ్రామాలు 382
మొత్తం సాగు భూమి 3,30,891.403 ఎకరాలు
జిల్లాలో సగటు భూ కమతం 2.29 ఎకరాలు

వ్యవసాయేతర భూముల్లోనూ చిక్కులు ఉన్నాయి. ఇప్పటికీ గ్రామాల్లో చాలా మందికి నివాస స్థలాలకు యాజమాన్య హక్కులు లేవు. అంతేకాక చాలా చోట్ల నివాస ప్రాంతాలు సైతం సాగు భూముల రికార్డుల్లోనే ఉన్నాయి. గ్రామాలు, పట్టణాలుగా మారిన సాగుభూములుగానే ఉన్నాయి. ఇక నిషేధిత జాబితా(పార్ట్‌బీ) భూ సమస్యలు అలాగే ఉన్నాయి.

కొత్త చట్టంతో ఊరట

కొత్త చట్టం అమలులోకి వస్తే, ధరణి పోర్టల్ స్థానంలో ఆర్వోఆర్ పోర్టల్ రానుంది. భూదార్ పేరుతో హక్కుల రికార్డులో నిర్ణయించిన రీతిలో ప్రత్యేక సంఖ్య ఇవ్వనున్నారు. తాత్కాలిక, శాశ్వత భూధార్ ఇస్తూ హక్కుదారులకు ప్రత్యేక భూధార్ కార్డు ఇవ్వనున్నారు. ఇక పాస్ బుక్ రికార్డుల కోసం సివిల్ కోర్టులకు వెళ్లే అవసరం లేకుండా సవరణ చేశారు. గ్రామీణ ప్రాంతాలకు సర్వే చేసేందుకు భూ పరిపాలన మెరుగైన చట్టం, అన్నీ భూచట్టాలను క్రోడీకరించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇక తహసీల్దార్లు, ఆర్డీవోలకు సైతం మ్యుటేషన్ అధికారం కల్పించడం వంటివి కొత్త చట్టంలో ఉండనున్నాయి. ఆర్డీవోల స్థాయిలో సాదాబైనామాల పరిష్కారం, రిజిస్ట్రేషన్, తర్వాత మ్యుటేషన్ వంటి ప్రక్రియలో మార్పులు చేశారు. యాజమాన్య హక్కుల సవరణకు వెసులుబాటు ఉన్నాయి. వ్యవసాయ, వ్యవసాయేతర, హక్కుల బదలాయింపులు, సొంతంగా దస్తావేజులు రాసుకునే అవకాశం.. వెనువెంటనే ఆన్‌లైన్‌లో నమోదు, వారసత్వ భూముల మార్పిడి సరళతరం, కుటుంబం మొత్తం సంతకం చేస్తేనే మార్పిడి చేసేందుకు అవకాశం వంటి నిబంధనలను సవరించారు. ఈ క్రమంలో జిల్లాలో భూ తగాదాలు లేకుండా సులభంగా అందరికీ పట్టాపాస్ బుక్కులు పొందగలితే ఎలాంటి చిక్కులు ఉండవని ప్రజలు ఆశిస్తున్నారు.

కుక్కలకు కుటుంబ నియంత్రణ!

- విజయవంతంగా సాగుతున్న ప్రక్రియ
- శస్త్ర చికిత్స, వ్యాక్సినేషన్ అనంతరం తెచ్చిన చోటుకే..



మంచిర్యాలలోని వీధికుక్కలను శస్త్రచికిత్సకు తీసుకెళ్తున్న సిబ్బంది

మంచిర్యాలటౌన్: వీధి కుక్కల బెడద నివారణకు మంచిర్యాల మున్సిపల్ సిబ్బంది పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు. పట్టణంలోని వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్నారు. వీధిలోని కుక్కలను పట్టుకెళ్లి ఎనిమల్ కేర్ సెంటర్‌లో శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు. వార్డుల వారీగా కుక్కలను తీసుకెళ్లి శస్త్ర చికిత్స చేసిన తర్వాత యాంటి రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్నారు. వారం రోజులపాటు అక్కడే ఉంచుకుంటున్నారు. తర్వాత తీసుకువచ్చిన వార్డులోనే వదిలేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నా.. పట్టణంలో కుక్కల దాడులు మాత్రం ఆగడం లేదు. కుక్కలను చంపేందుకు అనుమతి లేకపోవడం, వాటి సంతతి పెరగకుండా చేసేందుకు మాత్రమే అవకాశం ఉండడంతో కుక్కల దాడులను అధికారులు నివారించలేక పోతున్నారు. కుక్కలకు కు.ని ఆపరేషన్లను చేసిన అనంతరం యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తుండడంతో, వ్యాక్సిన్ వేసిన కుక్కలు ప్రజలను కరిచినా ప్రమాదం ఉండదని వైద్యులు పేర్కొంటున్నారు. అయితే కుక్కల్లో దేనికి రేబిస్ వ్యాక్సిన్ వేశారో తెలియక పోవడంతో కుక్కకాటుకు గురైన వారు యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను వేసుకోవడంతోపాటు, ఆ గాయానికి చికిత్స కోసం ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. కుక్కలు కరవకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టణంలో 1,440 కుక్కలు..

జిల్లా కేంద్రంలోని 36 వార్డుల్లో 1,440 కుక్కలు ఉన్నట్లుగా మున్సిపల్ అధికారులు గుర్తించారు. ఇందులో ఇప్పటికే 512 కుక్కలను పట్టుకెళ్లి జిల్లా కేంద్రంలోని డంపింగ్ యార్డు పక్కన నిర్మించిన ఎనిమల్ కేర్ సెంటర్‌కు తరలించారు. అన్ని వసతులతో కూడిన ఈ కేంద్రంలోనే కుక్కల కోసం ప్రత్యేకంగా శస్త్రచికిత్స గది ఏర్పాటు చేశారు. శస్త్రచికిత్సల అనంతరం ఐదు రోజుల వరకు పశు వైద్యాధికారి పర్యవేక్షణలోనే ఉండేలా బోన్లు ఏర్పాటు చేశారు. కుక్కలను పట్టుకెళ్లిన మొదటి రోజున పూర్తిగా వాటికి విశ్రాంతి ఇచ్చిన తరువాత రోజు వాటికి ఎలాంటి వ్యాధులు ఉన్నాయో తెలుసుకుంటారు. వాటికి సంతానం కలగకుండా శస్త్ర చికిత్స చేసి, నాలుగైదు రోజులపాటు అక్కడే బోనులో ఉంచి, ఆహారం అందిస్తున్నారు. యాంటీ బయోటిక్ ఇంజక్షన్, పెయిన్ కిల్లర్ మందులతోపాటు, నట్టల నివారణ మందు, యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇస్తున్నారు. ఐదు రోజుల తరువాత ఆ కుక్కలను ఎక్కడి నుంచి పట్టుకు వచ్చారో తిరిగి అదే వార్డులోకి చేరుస్తున్నారు.

శస్త్రచికిత్స చేసినట్లు తెలిసేలా..

ఏ కుక్కకు శస్త్ర చికిత్స, వ్యాక్సిన్ వేశారో గుర్తించేలా కుక్క ఎడమ చెవి దగ్గర చివరి భాగం కొంత కత్తిరిస్తున్నారు. వీటన్నింటిని నిర్వర్తించేందుకు పశు వైద్యాధికారితోపాటు, ప్రత్యేక సిబ్బందిని నియమించి అందుబాటులో ఉంచారు. ఒక్కో కుక్కకు రూ.1,650 చొప్పున చెల్లిస్తున్నారు. వీధిలోని కుక్కలను వార్డుల నుంచి తీసుకెళ్లిన ఐదు రోజుల వరకు ఆ వార్డులోని ప్రజలు కుక్కల బెడద తప్పిందని అనుకునేలోపు, శస్త్ర చికిత్సలు పూర్తి చేసుకుని తిరిగి అదే వార్డుల్లో కనబడుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాటికి వ్యాక్సిన్ వేసినా అవి కరుస్తుండడంతో గాయపడుతున్నామని పేర్కొంటున్నారు.

వ్యాక్సిన్ వేస్తున్నాం



వీధి కుక్కలకు సంతానం కలగకుండా శస్త్ర చికిత్స చేసి యాంటి రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్నాం. మాకు కుక్కలను చంపేందుకు, ఇతర చోటుకు తరలించి వదిలేసే అధికారం లేదు. కేవలం శస్త్రచికిత్స చేసి, తిరిగి అదే చోట వదిలేయాలన్న ఆదేశాలు న్నాయి. కుక్కల సంతతిని పెరగకుండా చూడడం కోసమే ఎనిమల్ కేర్ సెంటర్‌లో వాటికి కు.ని ఆపరేషన్లను చేయిస్తున్నాం. యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్నందున ఆ కుక్కలు కరిచినా రేబిస్ సోకే ప్రమాదం ఉండదు.

– మారుతి ప్రసాద్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

అంబులెన్స్‌ల తనిఖీ



అంబులెన్స్ నిర్వాహకులతో ఎంవీఐ రంజిత్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా కేంద్రంలోని అంబులెన్స్‌లను జిల్లా రవాణా శాఖ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఇటీవల అంబులెన్స్ నిర్వాహకులు రవాణా నిబంధనలు అతిక్రమించడంతోపాటు అవయవాల విక్రయంలో హస్తం ఉంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో ఈ తనిఖీలు జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు. ఎంవీఐ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిపిన తనిఖీల్లోవాహన ఫిట్‌నెస్ పత్రాలతోపాటు వాహన ధ్రువీకరణ పత్రాలు, ఇన్‌స్రూ?న్స్, డ్రైవింగ్ లైసెన్స్‌ను పరిశీలించారు. వారం రోజుల్లో అంబులెన్స్‌కు సంబంధించి పూర్తిస్థాయిలో ధ్రువీకరణ పత్రాలతోపాటు వాహన ఫిట్‌నెస్ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. మొదటి రోజు 30 అంబులెన్స్‌లను తనిఖీ చేశారు.

మెడికల్ కాలేజీలో ఇంటర్వ్యూలు

మంచిర్యాలక్రైం: జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిలో వివిధ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ సులేమాన్ తెలిపారు. కళాశాలలో 8 ప్రొఫెసర్ పోస్టులు, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 20, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 12, సీనియర్ రెసిడెన్సీలు 47, ట్యూటర్స్ 15, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు 6 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 30, 31 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలు www.gmcmancherial.org లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

విధులు సమర్థవంతంగా నిర్వహించాలి



కలెక్టర్ కుమార్ దీపక్‌కు మొక్క అందిస్తున్న డీఎం

మంచిర్యాలఅగ్రికల్చర్: పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు కేటాయించిన విధులను అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన కె.శ్రీకళ కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేశారు.

పులొచ్చింది..!?



- జన్నారం డివిజన్‌లో రెండు రోజులుగా సంచారం
- గిరిజనుల సమాచారంతో అప్రమత్తమైన అటవీ అధికారులు
- కదలికల ఆధారంగా గుర్తింపునకు ప్రయత్నం

జన్నారం: పెద్దపులి రాకకోసం ఎదురు చూస్తున్న కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టులోకి టైగర్ కదలిక ఒక్కసారిగా అలజడి రేపింది. 2022లో కడెం రేంజ్‌లోకి వచ్చిన బెబ్బులి రెండేళ్ల తర్వాత తాజాగా జన్నారం అటవీ డివిజన్‌లో సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. జన్నారం రేంజ్‌లోని పలు అటవీ బీట్‌లలో సంచరిస్తున్నట్లు ఆనవాళ్ల ఆధారంగా అంచనా వేస్తున్నారు. రెండు రోజుల క్రితం గొండుగూడ గ్రామ సమీపంలో మేతకు వెళ్లిన పశువుల్లో దూడ ఇంటికి రాలేదు. రాత్రి 8 గంటల ప్రాంతంలో గాయాలతో రావడంతో పులి దాడి చేసినట్లు అనుమానించిన గిరిజనులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అధికారులు గొండుగూడకు వెళ్లి దూడను పరిశీలించారు. గాయాలు పులి చేసినట్లుగానే అనుమానించారు. రెండు రోజులుగా జన్నారం, తాళ్లపేట్, ఇందన్‌పల్లి అటవి రేంజ్‌లలో పులి ఆనవాళ్ల కోసం ప్రయత్నిస్తున్నారు. గొండుగూడ బీట్‌లో పులి పాద ముద్రలు గుర్తించినట్లు తెలిసింది. అయితే కెమెరాకు చిక్కితే తప్ప పూర్తి వివరాలు వెల్లడించలేమని సిబ్బంది పేర్కొంటున్నారు. ఏళ్ల తర్వాత జన్నారం అటవీ డివిజన్‌కు పులి రావడంతో అటవీ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో టాంటాం:

కవ్వాల్‌లో పెద్దపులి సంచారంతో అలీనగర్, దొంగపల్లి, మల్యాలతోపాటు అటవీ సమీప గ్రామాల్లో అటవీ అధికారులు టాంటాం వేయించారు. పశువులను అడవుల్లోకి పంపకూడదని సూచించారు. అడవిలో అలజడి రేపొద్దని కోరుతున్నట్లు తెలిసింది. సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొంటున్నారు. పశువులపై పులి దాడి చేసి చంపితే పశువైద్యాధికారి పంచనామతో పులిదాడి అని తేలితే 24 గంటల్లో పరిహారం అందిస్తామని చెబుతున్నారు. పులి కదలికలను గుర్తించే పనిలో డివిజన్‌లోని వివిధ రేంజ్‌ల అటవీ అధికారులు నిమగ్నమయ్యారు. ఈ విషయమై జిల్లా అటవీశాఖ అధికారి శివ్‌ఆశిష్ సింగ్‌ను ఫోన్‌లో సంప్రదించగా జన్నారం అటవి డివిజన్‌లో పులి సంచారం నిజమేనని తెలిపారు. అయితే పులి ఏ వైపు సంచరిస్తుందో క్లారిటీ రాలేదని పేర్కొన్నారు. సిబ్బందిని అప్రమత్తం చేసి పులి ఆనవాళ్లను గుర్తిస్తున్నట్లు వెల్లడించారు. చాలా రోజుల తర్వాత పులి రావడం హర్షనీయమన్నారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులను అడవుల్లోకి పంపొద్దని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

నెన్నెల: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలో శుక్రవారం పర్యటించారు. నందులపల్లి గ్రామంలో ప్రజలతో మాట్లాడారు. దోమల బెడద ఉందని ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రతీ రోజు యాంటీ లార్వా మందులతో ఫాగింగ్ చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఫాగింగ్ యంత్రం లేకపోతే కొనుగోలు చేయాలన్నారు. పీహెచ్‌సీని తనిఖీ చేసి డాక్టర్లు, సిబ్బంది, మందుల వివరాలు తెలుసుకున్నారు. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. తర్వాత మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. పల్లె ప్రగతి, వన మహోత్సవం, ప్రజాపాలన పథకాల అమలు, పురోగతిపై అధికారులతో సమీక్షించారు. నర్సరీల్లో మొక్కలను పరిశీలించారు. వెదురుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని వెదురు పెంపకంపై గిరిజన రైతుల్లో అవగాహన పెంచాలని సూచించారు. వెదురుపై ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. తర్వాత ఎంపీడీవో కార్యాలయం ఎదుట అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కుశ్నపల్లిలో జెడ్పీహెచ్‌ఎస్, యూపీఎస్, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు పిల్లలు సరైన సమాధానం ఇచ్చారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ అమలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలో చేపట్టిన మరమ్మతు పనులు పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేసి గదులకు పెయింటింగ్ చేయించాలని ఆదేశించారు. చిత్తాపూర్‌లో గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. అదనపు గదుల నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిపివేయడంపై ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజుల్లో పనులుపూర్తి చేయాలని, లేదంటే కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాను ఫోన్‌లో ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రమేశ్, ఏపీవో నరేశ్ ఉన్నారు.

'గురుకులం'లో అదనపు కలెక్టర్ తనిఖీలు

- విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఆదేశం
- పాఠశాలలోనే విద్యార్థులతో కలిసి భోజనం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్లలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలోని రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. వంటగదితోపాటు నిత్యావసర సరుకులు, ఆహార సామగ్రిని తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మోతీలాల్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేలా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో అభివృద్ధి, మరమ్మత్తు పనులు చేపడుతోందని పేర్కొన్నారు. విద్యార్థులు సీజనల్ వ్యాధులు, విషజ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదనపు కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ కె.మోహన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

31 నుంచి పీవోడబ్ల్యూ రాష్ట్ర మహాసభలు



పోస్టర్లు విడుదల చేస్తున్న మహిళలు

బెల్లంపల్లి: ఈనెల 31, నుంచి సెప్టెంబర్ 2 తేదీ వరకు హైదరాబాద్‌లో పీవోడబ్ల్యూ 7వ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.జ్యోతి తెలిపారు. ఈమేరకు రాష్ట్ర సభల పోస్టర్లను బెల్లంపల్లిలోని సింగరేణి సివిక్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం విడుదల చేశారు. ఈసందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.జ్యోతి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని వీఎస్‌టీ ఫంక్షన్ హాల్‌లో మహాసభలు జరుగుతాయని తెలిపారు. సమాజంలో సగభాగమైన మహిళలు అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉన్నారన్నారు. అధికారంలో ఎవరు ఉన్నా మహిళలకు రక్షణ లేకుండాపోతోందని విమర్శించారు. సమానత్వం, తగిన గుర్తింపు లేకుండా చేస్తున్నారని, అంగట్లో సరుకుగా మహిళలను చిన్నచూపు చూస్తున్నారని పేర్కొన్నారు. మహిళలపై దాడులు, అకృత్యాలు పెరుగుతున్నా కట్టడికి చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని మండి పడ్డారు. ప్రభుత్వ మహిళా వ్యతిరేక విధానాలపై మగువలు సంఘటిత పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ డివిజన్ నాయకులు కృష్ణవేణి, ఈశ్వరి, పద్మ, లక్ష్మి, అమృత, కమల, సునీత, చంద్రకళ, రాజేశ్వరి, చిన్నక్క తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న డీఏవో కల్పన, డీసీవో సంజీవరెడ్డి

మంచిర్యాలఅగ్రికల్చర్: రైతుల అవసరాల మేరకు ఎరువులు సొసైటీల్లో అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి ఆదేశించారు. డీసీవో కార్యాలయంలో సొసైటీ సీవోలు, సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సొసైటీల్లో రైతుల అవసరాల మేరకు ఎరువులు ఉండాలన్నారు. పట్టా పాసుపుస్తకం ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సహకార శాఖ అధికారులు రవీందర్‌రావు, హన్మంత్‌రెడ్డి, సీవోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జనావాసాల్లోకి అడవి అలుగు


అలుగును పరిశీలిస్తున్న అధికారులు

మందమర్రిరూరల్: పట్టణంలోని జాతీయ రహదారి టోల్ ప్లాజా సమీపంలోని జనావాసాల్లోకి శుక్రవారం అడవి అలుగు వచ్చింది. పంచర్ షాపు నిర్వాహకుడికి అలుగు కనిపించడంతో వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని అలుగును స్వాధీనం చేసుకుని బొక్కలగుట్ట వద్ద గల గాంధారి వనంలోని అటవీ ప్రాంతంలో వదిలేశారు.

ఎస్‌బీఐ ప్రైవేట్ ఉద్యోగి సస్పెన్షన్


విచారణ జరుపుతున్న రీజినల్ మేనేజర్

జన్నారం: పంట రుణం రెన్యువల్ విషయంలో రైతు నుంచి రూ. 15 వేలు లంచం తీసుకున్న ఎస్‌బీఐ ప్రైవేట్ ఉద్యోగి ఎఫ్‌ఓఎస్ సాయికుమార్‌పై అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. శుక్రవారం మంచిర్యాల రీజినల్ మేనేజర్ రితేష్ బ్యాంకుకు వచ్చి విచారణ జరుపగా రైతు నుంచి డబ్బులు తీసుకున్న విషయంపై సాక్షులను విచారించి తాత్కాలికంగా ఆయనను తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు మేనేజర్ మహేశ్ తెలిపారు. పూర్తి విచారణ అనంతరం నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కేసు నమోదు

రైతు నుంచి రూ.15 వేలు తీసుకున్నట్లు హాస్టల్ తాండాకు చెందిన మ్యాక ఎర్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌బీఐ ఎఫ్‌ఓఎస్ సాయికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు.

మహిళా ఉద్యోగులను వేధిస్తే చర్యలు

శ్రీరాంపూర్: సింగరేణిలో మహిళా ఉద్యోగులను వేదిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కంపెనీ సీఎండీ బలరాం నాయక్ సూచించారు. ఈ మేరకు ఆయన ఏరియా జీఎంలకు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలన్నారు. వేధింపులు గురిచేసే వారిపై ఫిర్యాదు చేయడానికి అన్ని ఏరియాల్లో కమిటీలు, అంతర్గత కంప్‌లెంట్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు.

మంచం పట్టిన కొల్లూర్


జ్వరంతో మంచంపట్టిన మహిళ

కోటపల్లి: మండలంలోని కొల్లూర్ ఎస్సీ, ఎస్టీ కాలనీలో పది రోజులుగా ఇంటికి ఇద్దరి చొప్పున జ్వరాలతో మంచం పట్టారు. ఇటీవల వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేసినా జ్వరాలు నియంత్రణలోకి రావడం లేదు. దీంతో జ్వరబాధితులు ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. శుక్రవారం అధిక జ్వరంతో బాధపడే వారు 108లో చెన్నూర్ ఆస్పత్రికి వెళ్లారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జ్వరాలు విజృంభించకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గల్ఫ్ గాయం.. తీరని దుఃఖం!

ఖానాపూర్ మండలం గోసంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని నడిపంపల్లెకు చెందిన పుల్కం రాజేశ్వర్ ఉపాధి నిమిత్తం మూడేళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. అక్కడ కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 8న గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దుబాయ్‌లో ఉన్న బంధువులు మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించారు.

నిర్మల్ జిల్లా భైంసా మండలం కోతుల్‌గామ్ గ్రామానికి చెందిన సట్ల నరసయ్య జీవనోపాధికోసం ఏడాది క్రితం దుబాయ్‌కి వలస వెళ్లాడు. వారం రోజులక్రితం అనారోగ్యానికి గురయ్యాడు. ఆదివారం వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో తాను ఉంటున్న గదికే పరిమితమయ్యాడు. మంగళవారం తోటి కార్మికులు వెళ్లి చూడగా శవమై కనిపించాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించే ఏర్పాట్లు చేయాలని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం దేవునిగూడకు చెందిన కునారపు వెంకటేశ్ (28) ఉపాధి కోసం గతేదాది ఇరాక్ దేశం వెళ్లాడు. నాలుగు నెలలు అక్కడ పనిచేశాడు. అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా కృంగిపోయాడు. ఈ ఏడాది జనవరిలో గుండెపోటుతో మృతి చెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మెండోళ్ల సుధాకర్ ఆరునెలల క్రితం జిల్లాకు చెందిన ఓ ఏజెంట్‌కు లక్షలు చెల్లించి విజిట్ వీసాపై బహ్రెయిన్ వెళ్లాడు. అక్కడ సరైన పని దొరకక, చేసిన పనికి వేతనం రాక నరకయాతన అనుభవించాడు. దీంతో మనస్తాపానికి గురై ఈనెల 15న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని తెప్పించేందుకు గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం పాత మామిడిపల్లికి చెందిన పత్తిపాక వెంకటేశ్ (41) ఉపాధి నిమిత్తం గతేదాది జూన్ 21న సౌదీ వెళ్లాడు. అక్కడే పనిచేస్తుండగా జూలై 3న ఫిట్స్ రావడంతో తోటి కార్మికులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అదే నెల 8న మృతి చెందాడు. 19 రోజులకు మృతదేహం స్వగ్రామం చేరుకుంది.

- బతుకుదెరువుకు వెళ్లి మృత్యువాత పడుతున్న కార్మికులు
- నకిలీ ఏజెంట్ల వలలోపడి విలవిల..
- అక్కడ ఉండలేక, ఇక్కడికి రాలేక నరకయాతన
- కుటుంబ సభ్యుల అరణ్యరోదన
- కొనసాగుతున్న వరుస ఘటనలు


దేవునిగూడ లో వెంకటేశ్ శవపేటికపై పడి రోదిస్తున్న కుటుంబసభ్యులు(ఫైల్)


గల్ఫ్ వలసలపై అవగాహన కల్పిస్తున్న గల్ఫ్ సంఘాల నాయకులు (ఫైల్)


దుబాయ్‌లో ఆత్మహత్యచేసుకున్న వ్యక్తి మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని గల్ఫ్‌నాయకులకు విన్నవిస్తున్న బాధిత కుటుంబీకులు(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: 'దూరపు కొండలు నునుపు' అనే చందంగా ఉన్న ఊరిలో ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్ దేశాలకు వెళ్తే ఆర్థికంగా బాగుపడతామని జిల్లా నుండి ఒకరిని చూసి మరొకరు దుబాయ్, కువైట్, బహ్రెయిన్, తదితర దేశాలకు వలసబాట పడుతున్నారు. అలా వెళ్లినవారు అప్పుల బారినపడి అక్కడే తనువు చాలిస్తున్న ఘటనలు జిల్లాలో అనేకం కనిపిస్తున్నాయి. మృతదేహాల కోసం కుటుంబ సభ్యులు నెలల తరబడి ఎదురు చూడడం, ప్రభుత్వాలు, కార్మిక సంఘాల నాయకులను వేడుకోవడం వంటి ఉదంతాలు జిల్లాలో అనేకం కనిపిస్తున్నాయి.

నకిలీ వీసాలతోనే...

విదేశాల్లో ఉద్యోగాల పేరిట నకిలీ ఏజెంట్ల మోసాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. కొన్నేళ్లుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గల్ఫ్ దేశాలకు వలసలు పెరిగిపోతుండడంతో ఇటీవల ఏజెంట్ల సంఖ్య కూడా ఎక్కువైపోతోంది. గ్రామీణ ప్రాంతాలవారు గల్ఫ్ దేశాలబాట పట్టేందుకు ఆసక్తి చూపుతుండటంతో వారికి ఎక్కువ జీతాలను ఏరచూపుతూ వల వేస్తున్నారు. దీంతో నకిలీ ఏజెంట్ల బారినపడి అక్కడికి వెళ్లిన కార్మికులు తీవ్ర అపసోపాలు పడుతున్నారు. అక్కడ సరైన వేతనం లేక ఆర్థికంగా చితికిపోతున్నారు. గత్యంతరం లేక అక్కడే బలవన్మరణాలకు పాల్పడటమో, మనోవేదనతో గుండెపోటుకు గురికావడంతోనో తనువు చాలిస్తున్నారు.

ఉపాధి అవకాశాలు లేకనే..

ఉన్న ఊరిలో ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్ దేశాల బాట పడుతున్న కార్మికులు అక్కడ నరకయాతన అనుభవిస్తున్నారు. ఎప్పుడు స్వగ్రామానికి తిరిగి వస్తామో తెలియని పరిస్థితి నెలకొంటుంది. ఉమ్మడి జిల్లా నుండి ఎన్నో ఆశలతో కువైట్, సౌదీ అరేబియా, ఖతార్, బహ్రెయిన్, దుబాయ్ తదితర గల్ఫ్ దేశాలకు వెళ్తున్న కార్మికులు ఏజెంట్ల మోసాలతో వేదన అనుభవిస్తున్న తీరు ఇటీవల విడుదల చేస్తున్న సెల్ఫీ వీడియోలు తెలియజేస్తున్నాయి. చేసిన పనికి సరైన వేతనం అందటం మాట అటుంచి తిరిగి ఇంటికి రావాలన్నా విమాన ప్రయాణ చార్జీలకు వేలాది రూపాయలు వెచ్చించలేక మానసిక ఒత్తిడికి గురై అక్కడే మృత్యువాత పడుతున్న ఉదంతాలు వరుసగా వెలుగుచూస్తున్నాయి.

విజిట్ వీసాలతో గాలం

గల్ఫ్ దేశాల్లో ఉద్యోగం అనగానే ఎగిరి గంతేస్తూ ఇక్కడి కార్మికులు సరైన నైపుణ్యం లేకుండానే ఫ్లైట్ ఎక్కి విదేశాలకు వెళ్లిపోతున్నారు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత సరైన నైపుణ్యాలు లేకపోవడంతో అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. దీనికి తోడు విజిట్ వీసాపై వెళ్లి అక్కడ నైట్ వాచ్‌మెన్‌గా, కాపలాదారులుగా, ఇతర షాపింగ్‌మాల్స్‌లో లేబర్లుగా, గొర్రెలు, మేకల కాపరులుగా పనులు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. కంపెనీ వీసా పేరుతో ఒక్కొక్కరి వద్ద రూ.రెండు లక్షల నుంచి నాలుగు లక్షల వరకు వసూలు చేసి ఏజెంట్లు మోసం చేస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గల్ఫ్ దేశాలకు వలస బాట పడుతున్న కార్మికులకు సహకారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రభుత్వ సహకారం అవసరం



గల్ఫ్ దేశాలకు వలసబాట పడుతున్న కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన సహకారం అందించాలి. అనుమతి పొందిన ఏజెంట్ల ద్వారానే విదేశాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి. గల్ఫ్ దేశాల బాట పడుతున్న వారికి ఇక్కడే పలు రంగాల్లో స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తే వలసలు కూడా తగ్గుముఖం పడుతాయి. ఇక్కడే ఉపాధి అవకాశాలు పెంచుకునేలా చైతన్యం కల్పించాలి. గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం ద్వారా పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

– స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, నిర్మల్

కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా సంస్థ లాభాల్లో వాటా చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీరాంపూర్ టింబర్ యార్డ్ జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నారన్నారు. సంస్థ లాభాలలో కాంట్రాక్టు కార్మికుల కృషి కూడా ఎంతో ఉందన్నారు. కానీ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కంపెనీ లాభాలను ప్రకటించి అందులో నుండి కాంట్రాక్ట్ కార్మికులకు వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు గూడా వీరేశం, ఖాతా రాజు, ప్రభాకర్, సురేంద్ర చారి, రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ అధికారికి సన్మానం


శ్రీధర్‌ను సన్మానిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: ఎస్సార్పీ 3 గనిలో రక్షణ అధికారిగా విధులు నిర్వర్తించి ఆర్జీ–2 ఏరియాకు బదిలీపై వెళ్తున్న జి.శ్రీధర్‌ను శుక్రవారం గని అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. గనిపై జరిగిన కార్యక్రమంలో మేనేజర్ వెంకట్రావు, ఇతర అధికారులు ఆయనను సత్కరించి అతని సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గని అధికారులు గౌస్‌పాషా, మహేందర్, ప్రేమ్ కుమార్, అరుణ్ కుమార్, రామకృష్ణ శ్రవణ్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో..

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో శ్రీధర్‌ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ పిట్ సెక్రెటరీ పెంట శ్రీనివాస్, నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీనివాసరావు, సుధాకర్, నరసింహారెడ్డి, రాజయ్య, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో ఉత్తమ పురస్కారాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్‌పీడీసీఎల్ పరిధిలో ఉద్యోగుల మధ్య స్నేహపూర్వక పోటీ పెంచి వివిధ పారామీటర్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు విద్యుత్ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి 'బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ ది మంత్' పేరిట ఏప్రిల్ నుంచి ప్రతీనెల బహుమతులు అందజేస్తున్నట్లు విద్యుత్ శాఖ మంచిర్యాల జిల్లా ఎస్ఈ ఎస్.శ్రావణ్‌కుమార్ తెలిపారు. సప్లై మెయింటనెన్స్, డీటీఆర్ నిర్వహణ, వైఫల్యాలను తగ్గించడం, విద్యుత్ అంతరాయం తగ్గించడం, వినియోగదారులందరికీ సత్వర సేవ, కొత్త సర్వీస్ కనెక్షన్ల మంజూరు, మీటర్ల బిగింపు, ఎనర్జీ ఆడిట్, కెపాసిటర్స్‌ని పెంచడం తదితర మెరుగైన చర్యలు తీసుకుంటూ సంస్థ మనగడకు తోడ్పడడం, వినియోగదారులకు అందుబాటులో ఉంటూ అంతరాయం లేని సరఫరా చేయడం వంటి అంశాలను పరిగణంలోకి తీసుకోవడం జరుగుతుందని వివరించారు. ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లాలో బెల్లంపల్లి రూరల్ ఆపరేషన్ ఏఈ, ఉత్తమ అవార్డు, మేలో హాజీపూర్ ఆపరేషన్ ఏఏఈ సిబ్బందికి, మంచిర్యాల ఎస్ఈ, ఆపరేషన్ సిబ్బందికి ఉత్తమ అవార్డు, జూన్‌లో లక్సెట్టిపేట ఏఈ ఆపరేషన్ సర్కిల్ పరిధి సిబ్బందికి, ఏడీఈ లక్సెట్టిపేట ఆపరేషన్ విభాగం సిబ్బందికి, మంచిర్యాల ఎస్ఈ ఆపరేషన్ విభాగం సిబ్బందికి, జూలైలో ఏఈ ఆపరేషన్ బెల్లంపల్లి రూరల్ సిబ్బందికి ఉత్తమ అవార్డుకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు.

మస్టర్లలో కొట్టివేతలు..లెక్కల్లో తేడాలు

వేమనపల్లి: మండలంలో ఉపాధిహామీ పనుల మస్టర్లలో కొట్టివేతలు, హరితహారం కిందనాటిన మొక్కల్లో భారీగా తేడాలు వచ్చినట్లు సామాజిక తనిఖీ బృందాలు గుర్తించాయి. శుక్రవారం మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ మండల ప్రజావేదిక నిర్వహించారు. 2023 ఆగస్టు 13 నుంచి 2024 ఆగస్టు 16వరకు రూ.2 కోట్ల 50 లక్షల నిధులతో చేపట్టిన ఉపాధిహామీ పనులపై వారం రోజులుగా సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ ప్రజావేదికకు డీఆర్‌డీఓ కిషన్ ముఖ్య అతిథిగా హాజరై 14 గ్రామపంచాయతీలకు సంబంధించిన నివేదికలు సోషల్ ఆడిట్ జరిపించారు. హరితహారం రిజిస్టర్‌లు, ఎంబీల నిర్వహణలో వర్క్‌ఫైల్ ఒకే స్థాయిలో లేవని గుర్తించారు. కూలీల సంతకాలు సరిగా లేకుండా పనుల నిర్వహణ కొనసాగినట్లు వెల్లడైంది. నాటిన మొక్కలకు ఉన్న


వివరాలు వెల్లడిస్తున్న సామాజిక తనిఖీ బృందాలు

మొక్కలకు భారీగా వ్యత్యాసాలు ఉన్నట్లుగా గుర్తించారు. దీనికి బాధ్యులుగా పలువురు పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలకు జరిమానాలు విధించి షోకాజ్ నోటీసులు అందజేశారు. మళ్లీ ఇలాంటి పొరపాట్లు పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, గతంలో పని చేసిన ఎంపీడీఓ లక్ష్మయ్య, విజిలెన్స్ అధికారి కిరణ్, ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుబ్బరాంపల్లిలో తాటిచెట్టు పైనుంచి కిందపడి ముక్కెర సత్యనారాయణగౌడ్ (38) అనే గీత కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బావురావుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని గుండాయిపల్లెకు చెందిన ముక్కెర రాజుబాయి, మధునయ్య దంపతుల కుమారుడు సత్యనారాయణగౌడ్ శుక్రవారం తాటికల్లు తీసేందుకు చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య కనకలక్ష్మి ఉంది. సంఘటనా స్థలాన్ని చెన్నూర్ ఎస్సై శ్వేత


సత్యనారాయణగౌడ్ మృతదేహం

పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

పేపర్ మిల్లు యాజమాన్యంపై ఫిర్యాదు

కాగజ్‌నగర్ రూరల్: ఆరు సంవత్సరాలుగా సిర్పూర్ పేపర్ మిల్లు యాజమాన్యం మిల్లులో ఎన్నికలు నిర్వహించడంలేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని కార్మికశాఖ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి చర్చలు జరిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీఎల్‌టీ ఆర్డర్ ఇంప్లిమెంట్ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా నియమించాలన్నారు. ఈవిషయమై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆర్ఎస్‌పీ పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు లెండుగురె శ్యాంరావు, అంబాల ఓదెలు, నక్క మనోహర్, పేపర్ మిల్లు యూనియన్ నాయకులు ఈర్ల సతీశ్, రహీం, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత


పట్టుకున్న పశువులు

చింతలమానెపల్లి: మండలంలోని అడెపెల్లి నుండి మహారాష్ట్రకు అక్రమంగా పశువులను తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గురువారం సాయంత్రం ఆటో ట్రాలీలో రెండు కోడెలు, ఒక ఆవు దూడలను డబ్బా గ్రామం మీదుగా మహారాష్ట్రలోని అహేరికి తరలిస్తుండగా గ్రామస్తులు ప ట్టుకుని పోలీసులకు సమాచారం అందించా రు. పశువులను స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేశారు. చింతలమానెపల్లికి చెందిన కంబాల హరిప్రసాద్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించినట్లు ఎస్సై వివరించారు.

వాంకిడిలో...


పట్టుబడిన పశువులతో పోలీస్ అధికారులు

వాంకిడి: మండలంలోని గోయేగాం సమీపంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన పశువులను పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. పోలీస్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి శక్రవారం గోయేగాం సమీపంలో తనిఖీలు నిర్వహించగా 27 పశువులు లభ్యమైనట్లు తెలిపారు. పట్టుబడిన పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డెంగీతో వృద్ధురాలు మృతి?

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఈఏడాది తొలి డెంగీ మరణం నమోదైంది. మున్సిపాలిటీ పరిధి 9వవార్డు సుబ్బారావుపల్లి గ్రామానికి చెందిన మేరుగు రామక్క (75) డెంగీతో శుక్రవారం మృతి చెందింది. వృద్ధురాలికి పది రోజుల క్రితం తీవ్రమైన జ్వరం రావడంతో వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించి డెంగీ జ్వరంగా నిర్ధారించినట్లు గ్రామస్తులు తెలిపారు. మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందినప్పటికీ జ్వరం అదుపులోకి రాలేదు. పరిస్థితి మరింతగా విషమించి కన్ను మూసింది. దీంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. గ్రామంలో దోమల నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలని, వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని ఆ వార్డు కౌన్సిలర్ బూక్య రాములు నాయక్ డిమాండ్ చేశారు.

శాంతిఖని గనిలో స్పృహతప్పిన కార్మికుడు

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గనిలో శుక్రవారం ఓ కార్మికుడు స్పృహ తప్పి పడిపోయిన ఘటన చోటు చేసుకుంది. గని కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం..గనిలో జనరల్ మజ్దూర్ కార్మికుడిగా పనిచేస్తున్న మోసిన్ అలీ అనే కార్మికుడు మొదటి షిఫ్టు విధులకు వెళ్లాడు. భూగర్భంలోదిగి 59 లెవల్ 3 డీప్‌లో చైర్ లిఫ్టింగ్ పనులు నిర్వహిస్తుండగా అకస్మికంగా స్పృహతప్పి కిందపడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు గని ఉపరితలానికి తీసుకు వచ్చి స్థానిక సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. భూగర్భంలో గాలి సరఫరా సరిగా లేక సదరు కార్మికుడు స్పృహతప్పి పడిపోయినట్లు కార్మికులు పేర్కొన్నారు.


చికిత్స పొందుతున్న మోసిన్‌అలీ

కుల సంఘం పేరుతో వేధింపులపై ఫిర్యాదు

వేమనపల్లి: కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దూర్కె మోహన్ అనే వ్యక్తి చందాల పేరుతో పాఠశాలకు వచ్చి తమను ఇబ్బంది పెడుతున్నారని మండలంలోని రాజారాం, మంగెనపల్లి ఎంపీపీఎస్ పాఠశాలల ఉపాధ్యాయులు నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.2 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తే అంత ఇవ్వలేమని గతంలో రూ.500 చొప్పున ఇచ్చామని అన్నారు. మళ్లీ గురువారం తన పాప ఆరోగ్యం బాగా లేక కాంప్లెక్స్ హెచ్ఎంకు సమాచారం ఇచ్చి అతని అనుమతితో అంగన్‌వాడీ టీచర్‌కు ఇన్‌చార్జి ఇచ్చి 3 గంటలకు ఇంటి నుంచి బయలుదేరారని రాజారాం ఉపాధ్యాయురాలు పేర్కొన్నారు. ఇదే అలుసుగా తీసుకొని తాను లేని సమయంలో పాఠశాలకు వచ్చి మోహన్ అనే వ్యక్తి అడిగినంత చందా ఇవ్వలేదని ఉద్దేశపూర్వకంగా రాద్ధాంతం చేస్తున్నారని వాపోయారు. ఫొటోలు, వీడియోలు తీసి వాట్సాప్ గ్రూపుల్లో , పత్రిక విలేకరులకు ఫార్వార్డ్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వైకల్యం కలిగిన గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు యూత్ ఫర్ జాబ్స్ ఆధ్వర్యంలో రిటైల్, హాస్పిటాలిటి, బీఎఫ్ఎస్ఐ కోర్సుల్లో 2 నెలల పాటు హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ 40 నుంచి 100 శాతం వైకల్యం, 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు, టెన్త్, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 30 సాయంత్రం 6 గంటలలోగా ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9010295910 నంబరులో సంప్రదించాలని సూచించారు.

బెల్లం పట్టివేత


పట్టుకున్న బెల్లం, నిందితుడితో పోలీసులు

కౌటాల: అక్రమంగా తరలిస్తున్న బెల్లం పట్టుకున్నట్లు ఎస్సై ఎన్.మధుకర్ తెలిపారు. మండల కేంద్రంలోని తలోడి దసలి పట్టు పరిశ్రమ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న 7 క్వింటాళ్ల బెల్లం, 10కిలోల అల్లం పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆటోను సీజ్ చేసి జరుపుల శ్యామ్‌లాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

వాంకిడి: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. తిర్యాణి మండలం రొంపల్లి గ్రామానికి చెందిన పెంద్రం శ్యాంరావు, మహారాష్ట్రలోని గడ్‌వాందూర్‌కు చెందిన బోయ భాస్కర్ అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా 620 గ్రాముల గంజాయి లభ్యమైంది. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


నిందితులను చూపిస్తున్న ఎస్సై ప్రశాంత్

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

రెబ్బెన: మండలంలోని లక్ష్మీపూర్ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలనే లక్ష్యంతో మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా పెట్టగా అనుమతులు లేకుండా లక్ష్మీపూర్ వాగు నుండి రెబ్బెనకు ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టుబడినట్లు తెలిపారు. ట్రాక్టర్లను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌ను తరలించి కేసులు నమోదు చే సినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.